సాక్షి సూర్యాపేట

బుధవారం ; 22 ; మే ; 2024



వైభవంగా జయంత్యుత్సవాలు
యాదాద్రి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.
- 8లో



ప్రతి హామీని నెరవేరుస్తాం
కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెప్పారు.
- 8లో

గరిష్టం / కనిష్టం
38^{0} / 28^{0}

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టవ్యతిరేక పనులు మానుకోవాలి

● ఎస్పీ రాహుల్‌హెగ్డే

చివ్వెంల(సూర్యాపేట) : ప్రతి ఒక్కరూ సమాజిక బాధ్యతగా మెలిగి చట్టవ్యతిరేక పనులు మానుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. అక్రమ సిట్టింగ్‌లు, బహిరంగంగా మద్యం సేవించడం, సిగరేట్ తాగడం, అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దని సూచించారు. పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు.

గ్రామస్వరాజ్యం కోసం పరితపించిన నేత రాజీవ్‌గాంధీ



సూర్యాపేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దామోదర్‌రెడ్డి

భానుపురి : గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామస్వరాజ్యం కోసం పరితపించిన మహానేత రాజీవ్‌గాంధీ అని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఆర్ మాట్లాడారు. దేశాన్ని ఐటీరంగం, కంప్యూటర్ రంగం వైపు అడుగులు వేయించిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం అని చెప్పారు. ప్రాణాలను, పదవులను లెక్క చేయకుండా దేశాభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు ధరావత్ వీరన్ననాయక్, వేములకొండ పద్మ, అబ్దుల్‌రహీం, చెంచల శ్రీనివాస్, నాగుల వాసు, కందాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ ఇన్‌చార్జి వీసీగా నవీన్‌మిట్టల్

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌ను ప్రభుత్వం నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు వీసీగా ఉన్న గోపాల్‌రెడ్డి పదవీకాలం ముగిసింది. రెగ్యులర్ వీసీ వచ్చేంత వరకు మిట్టల్ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారు. బుధవారం ఉదయం 11 గంటలకు గోపాల్‌రెడ్డికి వీడ్కోలు, సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి తెలిపారు.

ఎంజీయూ బీఈడీ, డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎంజీయూ వీసీ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ బీఈడీ మొదటి సెమిస్టర్, డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. బీఈడీ సెమిస్టర్-1, డిగ్రీ మూడేళ్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను వీసీ గోపాల్ రెడ్డి.. రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి విడుదల చేశారు. అనంతరం ఈ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. బీఈడీలో 2,620 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,828 మంది ఉత్తీర్ణులయ్యారు. 789 మంది ప్రమోట్ అయ్యారు. డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాల్లో మొదటి సంవత్సరం 443 మందికి 198 మంది, రెండో సంవత్సరం 549 మందికి 251, తృతీయ సంవత్సరం 1,051 మందికి 556 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ ఎస్.గోపాల్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి జూన్ 10వ తేదీలోగా ఐటీఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రచార దూకుడు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి నాలుగు రోజులే గడువు
- ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు
- సుడిగాలి పర్యటనల్లో ఆయా పార్టీల ముఖ్య నేతలు
- గెలుపే లక్ష్యంగా జనంలోకి..



మిర్యాలగూడలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ దగ్గర పడుతుండడంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇన్‌చార్జి నేతలు సభలు, సమావేశాలుతో ప్రచారం మరింత ముమ్మరం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు సభలు, సమావేశాల్లో పాల్గొంటుండటంతో ప్రచారం ఊపందుకుంది.

జోరు పెంచిన కాంగ్రెస్

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ఆ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తోంది. జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎక్కడికక్కడ నియోజక వర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, పీసీసీ లీగల్‌సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్‌తో పాటు నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేయడంతో పాటు విలేకరుల సమావేశం నిర్వహించి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల తీరును ఎండగట్టారు. రెండు పార్టీల విధానాల వల్ల నిరుద్యోగులకు, ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్

ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రచారంలో దూసుకుపోతోంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని, తమ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. మంగళవారం నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొని కాంగ్రెస్, బీజేపీల విధానాలపై ధ్వజమెత్తారు. ఈ రెండు ప్రభుత్వాలతో దేశంలో పేదరికమే కాదు.. నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందంటూ ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

బీజేపీ విస్తృత ప్రచారం

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దీటుగా బీజేపీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని మాజీ మంత్రి ఈటల రాజేందర్, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ ప్రచారం చేయడంతో పాటు సమావేశాలు నిర్వహించారు. బుధవారం మాజీ మంత్రి డీకే అరుణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎవరికి వారు పట్టభద్రులను కలుస్తూ తమను గెలిపించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు కొందరు ప్రచారంలో వేగం పెంచారు. పోలింగ్‌కు ఆరు రోజుల గడువు ఉండడంతో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం సాగిస్తున్నారు.



బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేయాలని కొండమల్లేపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

రుణమాఫీ పేరుతో మోసం



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

- అబద్ధాలు ఆడటం, దేవుళ్లమీద ఒట్టువేయడం రేవంత్‌కు అలవాటే
- బోనస్ విషయంలో ఉత్తమ్ నిజం చెప్పాలి
- హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్
- హాజరైన మాజీ మంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

హుజూర్‌నగర్ : రూ.2లక్షల రుణమాఫీ చేస్తామంటూ రైతులను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. అబద్ధాలు ఆడటం అలవాటైన సీఎం పోయినకాడల్లా దేవుడి మీద ఒట్టు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఊసరవెల్లి రంగులు మారినట్లు రేవంత్ రెడ్డి తేదీలు మార్చుతుండని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చాలా తెలివైన వాడని ఆగస్టు 15 అన్నాడు కానీ సంవత్సరం చెప్పిండా అని ప్రశ్నించారు.

బోనస్.. బోగస్ అని తేలిపోయింది

'వరి పండించండి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని నాడు హామీ ఇచ్చారు. కానీ సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని కేబినెట్ మీటింగ్ తర్వాత స్పష్టంగా చెబుతున్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో సన్నవడ్లు మాత్రమే పండిస్తారని కానీ రాష్ట్రంలో 85 శాతం దొడ్డు వడ్లు పండిస్తారు.. ఎన్నికల ముందు అందరికి అన్నీ అని .. ఎన్నికల తర్వాత కొందరికే కొన్ని అని చెబుతున్నారు.. ఇప్పుడు బోనస్ కూడా బోగస్ అని తేలిపోయింది' అని దుయ్యబట్టారు. మంత్రి ఉత్తమ్ ప్రజల తరఫున నోరు విప్పి నిజం చెప్పాలన్నారు. బోనస్ పేరుతో మోసం చేసిన వారికి ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. సీఎం రేవంత్ చాలా తెలివైనవాడని నిజాయితీ గల మోసగాడని విమర్శించారు.

అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం

ఆరు గ్యారంటీల్లో ఫ్రీబస్సు తప్పా ఒక్కటైనా అమలవుతుందా అని ప్రశ్నించారు. ఆడపిల్లలకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ. 2 ,500, ముసలోళ్లకు నెలకు రూ. 4 వేల పింఛన్ అన్నారు వచ్చినయా, ఇంటికి ఇద్దరికి ఇస్తామన్న పింఛన్ ఇవ్వనేలేదని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం అన్నారు తులం ఇనుము కూడా ఇవ్వరని ఎద్దేవా చేశారు. మోసపోతే గోసపడతారని ఎన్నికల ముందు చెప్పామని అయినా వినలేదని అన్నారు. మీరు ఏరికోరి తెచుకున్నారు, వారు ఎగిరెగిరి తంతున్నారని చెప్పారు. కాంగ్రెది అభయ హస్తం కాదు భస్మాసుర హస్తమని విమర్శించారు. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అని రేవంత్ అన్నాడు ఇచ్చిండా అని ప్రశ్నించారు. రైతు బంధు కేసీఆర్ రూ. 10 వేలు ఇస్తే కాంగ్రెస్ వారు రూ. 15 వేలు ఇస్తామన్నారు కానీఇచ్చారా అని ప్రశ్నించారు. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతు బంధు ఓట్లు వేసేనాడు వేస్తున్నారని అన్నారు. రాకేష్‌రెడ్డికి ఓటు వేసి ఉత్తమ్‌కు, ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. బ్లాక్ మెయిలర్లను నమ్మవద్దని కోరారు. రాహుల్ , ప్రియాంక వచ్చి అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతును గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, భగత్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య యాదవ్, నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి, ఎంపీపీలు కెంకటరెడ్డి జ్యోతి, జెడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, నాయకులు జయబాబు, జక్కుల నాగేశ్వ రావు, అమర్ గౌడ్ పాల్గొన్నారు.

మట్టపల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



విద్యుత్ దీప కాంతుల్లో మట్టపల్లి ఆలయం

మఠంపల్లి : మట్టపల్లి పుణ్యక్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలతో అర్చకులు ప్రారంభించారు. ఆలయంలో శ్రీస్వామివారికి విష్వక్సేనారాధన , పుణ్యాహవచనం, ఆచార్యాది రుత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన , మృత్స్యం గ్రహణం, అంకురారోపణం, ధ్వజారోహణం, నవ కుంభారోపణం, అగ్నిప్రతిష్టాపనం తదితర పూజలు చేశారు. ఇక ఉదయం అధ్యయనోత్సవాల చివరి రోజు శాత్తుమర్లై ఉత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం లక్ష మల్లికా పుష్పపూజ, స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి మధుపర్క పూజ నిర్వహిస్తారు. ఇదే రోజు అర్ధరాత్రి నుంచి ఎదుర్కోళ్ల మహోత్సవంతో కల్యాణం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.

దోపిడీ వ్యవస్థ రద్దుకు పోరాటం

భానుపురి (సూర్యాపేట) : భూస్వామ్య, పెత్తందారులు, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొంటూ దోపిడీ వ్యవస్థ రద్దు కోసం పోరాటం చేశారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మదన్న కొనియాడారు. మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జెన్ను సార్) వర్ధంతిని సూర్యాపేట లోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఎం.డేవిడ్ కుమార్ ఆవిష్కరించగా సభలో మదన్న మాట్లాడారు. కార్యక్రమంలో వి.కోటేశ్వరరావు, మందుల రాజేంద్రప్రసాద్, ధర్మార్జున్, గంటా నాగయ్య, సాగర్, పి.లక్ష్మయ్య, బొడ్డు శంకర్, సైదులు, పి.కిరణ్ కుమార్, కాకి మోహన్‌రెడ్డి, కంచనపల్లి సైదులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ వెంకటరావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఎస్పీ రాహుల్‌హెగ్డే

భానుపురి (సూర్యాపేట) : లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, అబార్షన్లు చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టంపై మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి మాట్లాడారు. ఈ చట్టంపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖ అధికారులే కాకుండా ఆర్డీఓలు కూడా వారి పరిధిలో నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ ఆడపిల్లలు, స్త్రీలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రచారం చేయాలన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, అబార్షన్లు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ ఇరుగు కోటేశ్వరి, డీఈఓ అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదనరాజు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాస్, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి. వెంకటరమణ, డాక్టర్ జయ శ్యామ సుందర్, డాక్టర్ నాజియా, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా మీడియా అధికారి అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లాలో పట్టభద్రుల ఉప ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులు, సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ (వీఎఫ్‌సీ) లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఫెసిలిటేషన్ సెంటర్ ఈనెల 22 నుంచి 24 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి ఇచ్చే శిక్షణకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది ఏదైనా గుర్తింపు కార్డు చూపి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయవచ్చని సూచించారు.

అటవీ భూములను పరిరక్షించాలి

భానుపురి (సూర్యాపేట) : అటవీభూములను పరిరక్షించాలని కలెక్టర్ వెంకటరావు కోరారు. వివిధ పరిశ్రమలకు కేటాయించిన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు నడిగూడెం, చింతలపాలెం మండలాల్లో కేటాయించిన భూములకు సంబంధించి నోటిఫికేషన్ ప్రతిపాదనలపై మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడారు. పరిహార అటవీ భూముల నోటిఫికేషన్ ప్రతిపాదనలు పంపేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సతీష్ కుమార్, ఆర్డీఓలు సూర్య నారాయణ, శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ లక్ష్మీపతిరావు, నడిగూడెం తహసీల్దార్ హేమమాలిని, చింతలపాలెం తహసీల్దార్ సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు హాంఫట్!

- అత్యవసర పనుల్లో కోట్లలో అవినీతి
- అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు
- కోదాడ పట్టణంలోని ఒక్క 16వ వార్డులోనే రూ.30 లక్షలు స్వాహా



ఈ ఫొటోలో కన్పిస్తున్న బోరు కోదాడ మున్సిపాలిటీలోని 16వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారం కోసం గత నెలలో వేసింది. బోరు డ్రిల్లింగ్, మోటారు, ప్యానల్ బోర్డు ఏర్పాటుకు రూ.1.50లక్షలు అధికారులు ఖర్చు చేశారు. మరో రూ.2లక్షలు ఖర్చు చేసి పైప్‌లైన్ వేశారు. కానీ ప్రజలకు చుక్కనీరు అందలేదు. బోరు వేసిన కాంట్రాక్టర్ బిల్లులు తీసుకున్నాడు. తరువాత మోటారు, ప్యానల్ బోర్డులు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇలా ఈ వార్డులో 4 బోర్లు వేసి బిల్లులు తీసుకొని తరువాత మోటార్లు, ప్యానల్ బోర్డులను కాంట్రాక్టర్ తీసుకెళ్లినట్లు సమాచారం. బోర్లు వంద అడుగులు వేసి 300 అడుగులకు బిల్లులు తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా.. ఈ ఒక్క వార్డులోనే వేసవిలో అత్యవసర నీటి సరఫరా పేరుతో సుమారు రూ.30 లక్షలు కాజేశారు.

కోదాడ: కోదాడ మున్సిపాలిటీలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అత్యవసర పనుల పేరుతో లక్షల రూపాయలు కాజేసినట్లు తెలిసింది. వేసవిలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి ఎద్దడిని తీర్చడానికి ప్రభుత్వం మంజూరు చేసిన అత్యవసర నిధులను ఇష్టారాజ్యంగా స్వాహా చేసినట్లు సమాచారం. పట్టణంలో ఒక్కవార్డులోనే దాదాపు రూ.30 లక్షల అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇక 35 వార్డులను పరిశీలిస్తే ఈ అవినీతి కోట్లలో ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య వాటాల పంపిణీలో వచ్చిన విభేదాల కారణంగా ఈ అవినీతి వ్యవహారం బయటికి పొక్కినట్లు తెలిసింది.

35 వార్డుల్లో..

కోదాడ పట్టణంలో మొత్తం 35 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందో భాగంగా ఒక్కోవార్డులో బోర్లు వేసి మోటార్లు, ప్యానల్ బోర్డులు బిగించారు. ఈ క్రమంలో వార్డుల్లో వాటిలో బోర్లు వేసి మోటార్లు, ప్యానల్ బోర్డులు బిగించారు. అయితే కాంట్రాక్టర్లు బిల్లులు పొందిన తర్వాత ఆ బోరు మోటార్లు, ప్యానల్ బోర్డులు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం ఎన్ని ఉన్నాయో.. ఎన్ని ఎత్తుకెళ్లారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి మున్సిపాలిటీలో 10 సంవత్సరాలుగా చక్రం తిప్పుతున్న ఇద్దరు కాంట్రాక్టర్ల మధ్య వచ్చిన విభేదాలతో ఈ విషయం బయటకు పొక్కింది. మంగళవారం ఓ కాంట్రాక్టర్ మరో కాంట్రాక్టర్ చేసిన అవినీతిని మీడియా సమావేశంలో వెల్లడిస్తానని చెప్పడం, వెంటనే కొందరు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని రాజీ కుదర్చడంతో ఆ కాంట్రాక్టర్ ఫోన్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. అవినీతి వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధులు కూడా వాటాలు పుచ్చుకున్నట్లు సమాచారం.

విచారణ జరిపిస్తా



వేసవిలో పట్టణ ప్రజలు మంచినీటి సమస్య ఎదుర్కోకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయలను మంజూరు చేయించాను. ఈ నిధుల్లో అవినీతి జరిగితే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదు. ఈ మొత్తం విషయంపై విచారణ జరిపిస్తా. అవినీతి జరిగినట్లు తెలిస్తే ఎంతటివారినైనా వదిలేదు లేదు. గతంలో పని చేసిన వారు తమ పద్ధతులు మార్చుకోవాలి. నిజాయితీగా పని చేయకపోతే దండన తప్పదు.

– నలమాద పద్మావతి, కోదాడ ఎమ్మెల్యే

నేటి నుంచి పశువులకు టీకాలు

చివ్వెంల(సూర్యాపేట) : పశువుల అంటువ్యాధుల నివారణకు ఈనెల 22 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలకరి వర్షాలకు పెరిగే గడ్డిని మట్టితో సహా తినటంతో గేదెల్లో గురకవ్యాధి, గిత్తలు , పెయ్యల్లో జబ్బవాపు , గొర్రెలకు చిటుకు రోగం ప్రబలుతాయని పేర్కొన్నారు. రైతులు ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా చూస్తుండగానే పశువులు మరణించి కుటుంబాలకు తీరని ఆర్థిక నష్టం కలిగిస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి



అంజయ్య (ఫైల్)

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకొండి గ్రామానికి చెందిన గీతకార్మికుడు నకరకంటి అంజయ్య(58) రోజువారిగా మంగళవారం ఉదయం గ్రామ సమీపంలో తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు గొలుసు తెగిపోవడంతో పట్టు తప్పి కిందపడిపోయాడు. పక్కనే మరో తాటి చెట్టు ఎక్కుతున్న మరొక గీతకార్మికుడు గమనించి అంజయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి వచ్చి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో హైదరబాద్‌కు తరలిస్తుడంగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలు.. తుంగతుర్తి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన జిల్లాల రవీందర్(45) బైక్‌పై సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. భువనగిరి పట్టణంలోని డాల్ఫిన్ హోటల్ ఎదుట గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

టైరు పేలి కారు బోల్తా

- నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై మంగళవారం కారు టైరు పేలడంతో చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురుకి గాయాలయ్యాయి. వివరాలు.. కట్టంగూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెలిమినేడు శివారులోనికి రాగానే టైరు పగిలిపోయింది. దీంతో కారు హైవే పక్కనే చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న భాస్కర్, అతని భార్య సింధూరతో పాటు కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి, పూజకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం అని తెలిసింది.

వైభవంగా కొనసాగుతున్న జయంత్యుత్సవాలు

- ఉదయం కాళీయమర్ధన శ్రీకృష్ణాలంకార సేవలో..
- సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరాముడిగా ఊరేగిన నృసింహుడు
- నేటితో ఉత్సవాలు పరిసమాప్తం



కాళీయమర్ధన శ్రీకృష్ణాలంకారంలో స్వామివారు



హనుమంత వాహనంపై శ్రీరామావతార అలంకార సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం, అభిషేకం, అర్చనలు, నిత్య హవనములు, మూలమంత్ర జపములు, లక్ష్మీ సూక్త విష్ణుసహస్రనామ పారాయణాలు జరిపించారు. ఉదయం ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల చెంత లక్షపుష్పార్చన పూజలు చేపట్టారు. అనంతరం కాళీయమర్ధన శ్రీకృష్ణా అలంకార సేవను మాడ వీధులు, తిరువీధుల్లో ఊరేగించారు.

సాయంత్రం హనుమంత వాహనంపై..

సాయంత్రం ఆలయంలో నిత్య హవనములు, సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనం జరిపించారు. అనంతరం హనుమంత వాహనంపై శ్రీరాముడి అలంకార సేవలో స్వామివారిని ఆలయ మాడ, తిరువీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతగుట్టలో..

యాదాద్రి ఆలయానికి అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకములు, నవకలశ స్నపనము, లక్ష పుష్పార్చన జరిపించారు. సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు, వేద పారాయణీకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

జయంత్యుత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉదయం శ్రీయాదాద్రి భక్త భజన సమాజం, శ్రీగాయత్రి మహిళ భజన మండలి యాదగిరిగుట్టచే భజన నిర్వహించారు. సాయంత్రం శారద సంగీత అకాడమీ, అన్నమాచార్య అకాడమీచే భక్తి సంగీతం, శివచంద్ర లహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారు, నాగదుర్గ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు ఎల్.ఎం.ఏ బాలగంధర్వం వ్యవస్థాపకులు శ్రీరామాచారి బృందంచే భక్తి సంగీత విభావరి జరిపించారు.

ఎల్‌ఈడీ స్క్రీన్ ప్రారంభం..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు మాడ వీధిలో బిగించిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ను మంగళవారం ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. తూర్పు మాడ వీధిలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలయ ముఖ మండపంలో, ప్రథమ ప్రాకార మండపంలో జరిగే స్వామివారి పూజా కార్యక్రమాలను మాడ వీధుల్లో భక్తులు వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీన్‌లను బిగించారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

బుధవారంతో జయంత్యుత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 7గంటలకు ప్రధాన ఆలయంలో మూలమంత్ర హవనములు జరిపిస్తారు. ఉదయం 9గంటల నుంచి 9.30గంటల వరకు పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్టి జరిపించి ఉత్సవాలను పరిసమాప్తం చేస్తారు.



ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు తదితరులు

దీక్ష విరమించిన మాలధారులు



ఆలయ ముఖ మండపంలో ఇరుముడులతో మాలధారులు

నృసింహుడి జయంత్యుత్సవాలను పురస్కరించుకొని మండల దీక్ష చేపట్టిన భక్తులు దీక్షను విరమించారు. 41 రోజుల పాటు మండల దీక్ష చేసిన భక్తులు.. మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఇరుముడులను ఆలయ అర్చకులకు అప్పగించి దీక్ష విరమించారు.

కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ



కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తున్న కళాకారులు

జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం యాదాద్రి కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద సాంస్కృతిక విశ్వ కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కే. రాంనరసయ్య, కూచిపూడి నృత్య గురువు ప్రసాద్‌రాయుడు, కూచిపూడి నృత్య కళాకారిణి ఆర్. గాయత్రి కూచిపూడి నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున నృత్యం చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తామని సాంస్కృతిక విశ్వ కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రాంనరసయ్య తెలిపారు.

అతిథులొచ్చారు..!





పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ, పెద్దరావులపల్లి చెరువుల్లో సైబీరియన్ కొంగలు సందడి చేస్తున్నాయి. పగలంతా చెరువులు, పంటపొలాల్లో విహరించి రాత్రి వేళ సమీపంలోని చెట్లపై నివాసముంటున్నాయి. ప్రతి ఏటా సైబీరియన్ కొంగలు మూసీ పరీవాహక ప్రాంతమైన పోచంపల్లి మండలానికి వలస వస్తుంటాయి.

– భూదాన్‌పోచంపల్లి

రవీంద్రకుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రులు



కనిలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దేవరకొండ: బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనిలాల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కనిలాల్ దశదిన కర్మకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, వి. శ్రీనివాస్‌గౌడ్ హాజరై కనిలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రకుమార్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, ఎంపీ అభ్యర్థులు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, బాలరాజుయాదవ్, కిషన్‌నాయక్ తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలవన్మరణం

మోతె: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మోతె మండల పరిధిలో ఉర్లుగొండ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. ఖమ్మం జిల్లా తిర్మలాయపాలెం మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన కంచెం కొమరయ్య(38), రమ భార్యాభర్తలు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కొమరయ్య భార్య రమ వారం రోజుల క్రితం తన ముగ్గురు ఆడపిల్లలను తీసుకొని తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన కొమరయ్య సోమవారం అర్ధరాత్రి మోతె మండలం ఉర్లుగొండ గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు పట్టుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న బల్మూరి వెంకట్, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెప్పారు. మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మళ్లీ అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 46, 317, ఇతర ఉద్యోగుల సమస్యలపై తమ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసి పరిష్కరిస్తుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కై తీన్మార్ మల్లన్నను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. పది సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక విధానాలపై మల్లన్న పోరాటం చేశాడన్నారు. ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్న చట్టసభలలో ఉంటే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఓటర్లంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పట్టభద్రులు జాగ్రత్తగా ఓటేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన



నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ రోజు ఓటర్లు నిబంధనల ప్రకారం జాగ్రత్తగా ఓటేయాలని నల్లగొండ కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్లు వారు ఓటు వేసే అభ్యర్థికి ఎదురుగా బ్యాలెట్ పేపర్‌తో పాటు ఎన్నికల సంఘం ద్వారా సరఫరా చేయబడిన వాయిలెట్ స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. ఓటు వేసేందుకు ఎంచుకున్న అభ్యర్థికి ఎదురుగా 1 లేదా 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో అంకెలు మాత్రమే వేయాలని, అక్షరాల రూపంలో రాయొద్దని తెలిపారు. నోటాకు ఓటేయాలనుకుంటే బ్యాలెట్ పేపర్‌పై 1, 2, ప్రాధాన్యతల తర్వాత 3వ ప్రాధాన్యతా ఓటును నోటాకి ఎదురుగా మార్క్ చేయవచ్చని పేర్కొన్నారు.

తీన్మార్ మల్లన్నను పోటీ నుంచి తప్పించాలి

- కలెక్టరేట్ ఎదుట పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి నిరసన



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జడ్సన్

నల్లగొండ: పట్టభద్రులను బ్లాక్‌మెయిల్ చేస్తున్న కాంగ్రెస్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పోటీ నుంచి తప్పించాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రచారం సందర్భంగా తీన్మార్ మల్లన్న శాసన మండలికి పంపుతారా.. లేకుంటే శ్మశానానికి పంపుతారా.. అని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశాడని, దీనిపై ఎన్నికల సంఘానికి, ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జాకు, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో తాను నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రులందరిని బ్లాక్ మెయిల్ చేస్తూ మాట్లాడిన కూడా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. పట్టబద్రులు, నిరుద్యోగులు అంతా తనకు మద్దతు పలుకుతున్నారన్న కారణంతో అధికార కాంగ్రెస్ పార్టీ 27 మంది ఎమ్మెల్యేలను, ఏడుగురు మంత్రులను, 34 మంది కోఆర్డినేటర్లను నియమించి తనను ఓడించాలని చూస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా తన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, దీక్ష చేస్తున్న జడ్సన్‌ను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారు.

'మహాలక్ష్మి'ల ఆగ్రహం !

- బస్సు ఆపలేదని డ్రైవర్‌ని కొట్టిన మహిళలు
- మిర్యాలగూడ బస్టాండ్‌లో ఘటన

మిర్యాలగూడ అర్బన్: బస్సు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్సు డ్రైవర్‌పై మహిళలు చేయి చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుకుంది. దేవరకొండ డిపోకు చెందిన బస్సు మిర్యాలగూడకు వస్తున్న సమయంలో అంగడిపేట స్టేజీ వద్ద కొంత మంది మహిళలు చెయ్యి ఎత్తి బస్సును ఆపారు. ఆ బస్సు డ్రైవర్ మహిళలు ఉన్న చోట కాకుండా కొద్ది దూరం వెళ్లి ఆపడంతో అక్కడ ఉన్న మహిళలు కొంతమంది పరిగెత్తుకుంటూ వెళ్లి బస్సు ఎక్కారు. ఈ లోగా బస్సును కదిలించడంతో బస్సు ఎక్కిన మహిళలు మావారు వస్తున్నారు.. బస్సు ఆపాలని డ్రైవర్‌తో అనగా .. వెనకాల మరో బస్సు వస్తుంది.. అంటూ డ్రైవర్ బస్సును నడపడంతో మేము కూడా దిగుతామని బస్సు ఆపాలని చెప్పడంతో బస్సు ఆపి వారందరు దిగిన తరువాత బస్సు వెళ్లిపోయింది. ఆ వెనకాలే వస్తున్న మరో బస్సులో అందరు మహిళలు ఎక్కి మిర్యాలగూడ బస్టాండ్‌కు చేరుకున్న అనంతరం బస్సునుంచి దిగిన మహిళలు ముందుగా వచ్చిన బస్సు డ్రైవర్‌ను బస్సు ఎందుకు ఆపలేదని చేయి చేసుకున్నారు. డ్యూటీలో ఉన్న తనను కొట్టారని సదరు డ్రైవర్ మహిళలపై కేసు పెట్టారు. విషయం తెలుసుకున్న మహిళలు .. ఆ డ్రైవర్ మా అమ్మాయి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ డ్రైవర్‌పై కేసు పెట్టారు. దీంతో అవాక్కైన డ్రైవర్ చేసేది ఏమీ లేక పోలీసుల వద్ద తన గోడును వెల్లబోసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురితో చర్చించి రాజీకుదిర్చారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

- మరో వ్యక్తికి గాయాలు
- యాదగిరిగుట్ట మండలం సైదాపురం శివారులో ఘటన



శ్రీనివాస్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం సాదువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్(36) మగ్గం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం సాధువెల్లి గ్రామం నుంచి బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం యాదగిరిగుట్టకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని సైదాపురం గ్రామ శివారులోని కోహినూర్ డైమండ్ వెంచర్ సమీపంలోకి రాగానే, అదే మార్గంలో యాదగిరిగుట్టకు బైక్‌పై కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన జిల్లా భరత్ వెనుక నుంచి వేగంగా వచ్చి శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో గోలి శ్రీనివాస్ ఎగిరి కిందపడడంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మరో బైక్‌పై వెళ్తున్న భరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

మట్టి పరీక్షలకు అనువైన సమయమిదే..

- గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త ఎ. కిరణ్



మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమయ్యింది. ఈ సమయంలోనే రైతులు మట్టి నమూనాలు తీసి, వాటిని పరీక్ష చేయించి, ఆ భూసార ఫలితాల ఆధారంగా పంటలు, ఎరువులను ఉపయోగించాలని గడ్డిపల్లి కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త ఎ. కిరణ్ చెబుతున్నారు. మట్టి నమూనా సేకరణకు సంబంధించి తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

- పంట కోత తర్వాత పొలాల్లో నుంచి మట్టిని తీసి పరీక్ష చేయించవచ్చు.
- వేసవిలో పంటలు లేని సమయంలో మట్టిని తీయవచ్చు.
- ఎరువులు వేసిన తర్వాత నెల రోజుల వరకు మట్టి నమూనా తీయరాదు.
- నీరు పెట్టిన తర్వాత తీయరాదు.
- నీడపడే ప్రదేశాలు, నీటి ముంపు ప్రాంతాలు, పెంట కుప్పల దగ్గర, గట్లు, చెట్లు, రోడ్ల దగ్గర మట్టిని తీయరాదు.
- ఒక రకం పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం మరీ పెద్దయితే ప్రతి ఐదు ఎకరాలలో నమూనా తీయాలి.
- నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, గుణాలు, పంటల సరళి మొదలగు విషయాలలో ఏదైనా తేడా కన్పిస్తే అన్ని నమూనాలు ఆ పొలం నుంచి తీయాల్సి ఉంటుంది.
- పైరు పంటలకు 6 అంగుళాల లోతులో మట్టిని నమూనా సేకరించాలి.
- పండ్ల తోటల్లో 5 నుంచి 6 అడుగుల వరకు ప్రతి అడుగుకు ఒక నమూనా తీయాలి.
- కారి, చౌడు, ఆమ్ల నేలలకు అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

నమూనాలు ఎలా సేకరించాలి

- నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొదలగు వాటిని తీసివేయాలి.
- గడ్డపార లేదా పారను ఉపయోగించి మట్టి నమూనాను తీయాలి.
- గొయ్యి అంచుల నుంచి పారతో గానీ, తాపీతో గానీ మట్టిని సేకరించాలి.
- పొలంలో 8 నుంచి 10 స్థలాల నుండి మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టినంతటిని కలిపి నేలపై పరిచి దానిని 4 భాగాలు చేయాలి. మూలలకు ఎదురెదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి. ఈ విధంగా 500 గ్రాముల నమూనాలను సేకరించాలి.
- ఈ అరకేజీ మట్టిని గుడ్డ సంచిలో లేదా పాలిథిన్ సంచిలో వేసి, రైతు పేరు, చిరునామానా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటలు, గత 3 సంవత్సరాలుగా వాడుతున్న ఎరువులు, రాబోవు సీజన్‌లో వేయాల్సిన పంటలు సేకరించిన తేదీ మొదలగు వివరాలను జతచేయాలి.
- సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు లేదా భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి. లేదా గడ్డిపల్లి కేవీకేకు పంపించినా పరీక్షలు చేసి, సాయిల్ హెల్త్‌కార్డు పంపిణీ చేస్తారు.

భూసార పరీక్షల వలన ఉపయోగాలు

- పొలంలో పోషకాల స్థాయి తెలుస్తుంది.
- ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చో తెలుస్తుంది.
- ఎరువులు ఎంత మోతాదులో, ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేలల సమస్యలు తెలుస్తాయి. దాని ప్రకారం ఎరువులను ఉపయోగించవచ్చును.
- ఎరువుల అనవసరపు ఖర్చు తగ్గించవచ్చు. సరైన సమయంలో భూసార పరీక్షలు చేయిస్తే సేంద్రియ ఎరువులను కూడా ఉపయోగించి నాణ్యమైన పంటలను పండించవచ్చు.